


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM






వేలంలో రూ.40 కోట్లకు అమ్ముడుపోయిన

# నెల్లూరు ఆవు


## ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా రికార్డు

మన దగ్గర దొరికే నెల్లూరు, ఒంగోలు మేలు రకానికి చెందిన ఆవులు బాగా ప్రసిద్ధి. ఈ జాతులకు చెందిన ఆవులకు దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. తాజాగా నెల్లూరు మేలు రకానికి చెందిన ఓ ఆవు బ్రెజిల్‌లో రికార్డు ధర పలికింది. వయాటినా – 19 ఎఫ్ఐవీ మారా ఇమోవిస్ అని పిలవబడే నెల్లూరు జాతికి చెందిన ఆవు బ్రెజిల్ వేలంలో.. ఏకంగా 4.8 మిలియన్ అమెరికన్ డాలర్లకు అమ్ముడుపోయింది. అంటే మన భారత కరెన్సీ ప్రకారం అక్షరాలా రూ.40 కోట్లన్నమాట. భారతదేశానికి చెందిన ఈ మేలుజాతి ఆవు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఆవుగా రికార్డుకెక్కింది. దీంతో ఈ అంశం కాస్తా ప్రస్తుతం చర్చీనాయాంశమవుతోంది. ఈ రకపు ఆవును 1868లోనే బ్రెజిల్‌కు తరలించారు. అప్పటి నుంచి ఈ రంక ఆవులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఏర్పడింది. మరోవైపు ఈ రకం ఆవులు ఒక్క బ్రెజిల్ దేశంలోనే 16 మిలియన్ల వరకూ ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

వాట్సాప్‌లో వస్తున్న

# మరో అద్భుతమైన ఫీచర్

కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తోంది. ఇప్పుడు లింక్ ప్రివ్యూ ఫీచర్‌పై పని చేస్తోంది. ఈ ఫీచర్ వచ్చిన తర్వాత మీరు ఎవరితోనైనా షేర్ చేస్తున్న లింక్ ప్రివ్యూ కనిపించాలా వద్దా అనేది మీరు మాత్రమే నిర్ణయించగలరు. ప్రస్తుతం బీటా వినియోగదారుల కోసం కొత్త ఫీచర్‌ను విడుదల చేశారు.




# శుభ్‌మన్ గిల్‌కు భారీ జరిమానా

ఓటమి బాధలో ఉన్న గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు భారీ షాక్ తగిలింది. ఐపీఎల్ నిర్వాహకులు రూ. 12 లక్షల మేర అతడికి భారీ జరిమానా విధించారు. కాగా ఐపీఎల్-2024లో ముంబై ఇండియన్స్‌పై గెలిచి శుభారంభం చేసిన టైటాన్స్.. మంగళవారం నాటి మ్యాచ్‌లో మాత్రం ఓటమిని మూటగట్టుకుంది. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఏకంగా 63 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. సమిష్ట వైఫల్యంతో పరాభవం చవిచూసింది. అయితే, ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయని కారణంగా కెప్టెన్ శుభ్‌మన్‌కు ఫైన్ పడింది. ఈ మేరకు.. "ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో భాగంగా ఎంఏ చిదంబరం స్టేడియంలో.. మార్చి 26న చెన్నై సూపర్ కింగ్స్‌లో మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు మెయింటెన్ చేసిన కారణంగా.. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు జరిమానా విధిస్తున్నాం. ఈ సీజన్‌లో ఇది గుజరాత్ టైటాన్స్ తొలి తప్పిదం కాబట్టి.. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని నిబంధనల ప్రకారం గిల్‌కు రూ. 12 లక్షల ఫైన్ వేస్తున్నాం" అని ఐపీఎల్ నిర్వాహకులు అధికారిక ప్రకటన విడుదల చేశారు.



అభ్యర్థులను ప్రకటించిన

# ఉద్ధవ్ శివ సేన.. 17మందితో జాబితా విడుదల




ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన పార్టీ.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించింది. ఫస్ట్ లిస్టులో 16 మంది అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. మాజీ కేంద్ర మంత్రులు అనంత్ గీతే, అర్వింద్ సావంత్‌లకు తొలి జాబితాలో చోటు కల్పించారు. రాయిగడ్ నుంచి అనంత్ గీతే, సౌత్ ముంబై నుంచి అరవింద్ సావంత్ పోటీపడనున్నారు. థానే నుంచి రంజన్ విచారే, ముంబై నార్త్ వెస్ట్ నుంచి అమోల్ కీర్తికర్, ముంబై నార్త్ ఈస్ట్ నుంచి సంజయ్ పాటిల్ పోటీలో ఉన్నారు. ఉద్ధవ్ నేతృత్వంలోని శివ సేన పార్టీ.. మహా వికాశ్ అఘాది కూటమిలో ఉన్న విషయం తెలిసిందే. మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఆ రాష్ట్రంలో మొత్తం అయిదు దశల్లో ఆ స్థానాలకు పోలింగ్ జరగనున్నది.

| | |
|---|---|
| బుల్దానా | ప్రొ. నరేంద్ర ఖేడేకర్ |
| యావత్మాల్-వాషిం | సంజయ్ దేశ్‌ముఖ్ |
| మావల్ | సంజోగ్ వాఘేరే-పాటిల్ |
| సాంగ్లీ | చంద్రహర్ పాటిల్ |
| హింగోలి | నగేష్ పాటిల్ అష్టికర్ |
| ఛత్రపతి శంభాజీనగర్ | చంద్రకాంత్ ఖైరే |
| ధర్శివ్ | ఓంరాజే నింబాల్కర్ |
| షిర్డీ | భౌసాహెబ్ వాఘ్‌చోరే |
| నాసిక్ | రాజాభౌ వాజే |
| రాయగడ | అనంత్ గీతే |
| సింధుదుర్గ్-రత్నగిరి | వినాయక్ రౌత్ |
| థానే | రాజన్ విచారే |
| ముంబై-నార్త్ ఈస్ట్ | సంజయ్ దిన పాటిల్ |
| ముంబై-సౌత్ | అరవింద్ సావంత్ |
| ముంబై-సౌత్ సెంట్రల్ | అనిల్ దేశాయ్ |
| ముంబై-నార్త్ వెస్ట్ | అమోల్ కీర్తికర్ |
| పర్భానీ | సంజయ్ జాదవ్ |

**ఉత్తరప్రదేశ్ తర్వాత దేశంలోనే అత్యధిక లోక్ సభ స్థానాలు రాష్ట్రంగా మహారాష్ట్ర ఉంది. ఉత్తర్ ప్రదేశ్ లో 80 లోక్ సభ స్థానాలు ఉండగా మహారాష్ట్రలో 48 ఉన్నాయి. మహారాష్ట్రలో ఏప్రిల్ 19 నుంచి ఐదు దశల్లో పోలింగ్ జరగనుంది.**

## వాషింగ్ మెషీన్‌లో కరెన్సీ కట్టలు.. 2.5 కోట్లు సీజ్ చేసిన ఈడీ

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు వేర్వేరు నగరాల్లో సోదాలు నిర్వహించారు. సుమారు 2.54 కోట్ల నగదును వాళ్లు సీజ్ చేశారు. అయితే ఓ ఇంట్లో వాషింగ్ మెషీన్‌లో కూడా సొమ్ము దాచుకున్నారు. ఆ మెషీన్ నుంచి నోట్ల కట్టలను ఈడీ వెలికి తీసింది. ఫెమా ఉల్లంఘనల కేసులో ఈడీ సోదాలు చేసింది. కాప్రికార్నియన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్, లాక్స్‌మిటాన్ మారిటైం, హిందుస్తాన్ ఇంటర్నేషనల్, రాజ్‌నందిని మెటల్స్, స్టావార్ట్ అలాయ్స్, భాగ్యనగర్ లిమిటెడ్, వినాయక స్టీల్స్, వశిష్ట కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలు, వాటి డైరక్టర్ల ఇండ్లల్లో సోదాలు జరిగాయి. విజయ్ కుమార్ శుక్లా, సంజయ్ గోస్వామి, సందీప్ గార్డ్, వినోద్ కేడియా లాంటి డైరెక్టర్ల నివాసాల్లో తనిఖీలు నిర్వహించారు. ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, కురుక్షేత్ర, హర్యానా రాష్ట్రాల్లో ఆ సోదాలు చేపడుతున్నారు. అయితే వాషింగ్ మెషీన్‌లో ఉన్న క్యాష్‌ను ఎక్కడ రికవరీ చేశారన్న విషయాన్ని మాత్రం ఈడీ వెల్లడించలేదు. భారీ మొత్తంలో సొమ్మును విదేశాలకు తరలిస్తున్నారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ సోదాలు చేపట్టింది. సింగపూర్‌కు చెందిన గెలాక్సీ షిప్పింగ్ కంపెనీకి సుమారు 1800 కోట్లు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కా




ప్రికార్నియన్ షిప్పింగ్ కంపెనీ నుంచి ఆ డబ్బును విదేశాలకు వెళ్లినట్లు గుర్తించారు. అంథోనీ డిసిల్వా అనే వ్యక్తి ఆ కంపెనీ నడుపుతున్నట్లు తెలుస్తోంది. షెల్ కంపెనీల ద్వారా భారీ మొత్తం లావాదేవీలు జరిగినట్లు భావిస్తున్నారు. నేహ మెటల్స్, అమిత్ స్టీల్ ట్రేడర్స్, ట్రిపుల్ మెటల్, హెచ్‌ఎంఎస్ మెటల్స్ లాంటి కంపెనీలు నుంచి ఆ లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది.



నెటిజన్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన

# ఆదాశర్మ

బాలీవుడ్ నటి ఆదాశర్మ ఓ నెటిజన్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. గతేడాది ఆదాశర్మ నటించిన సూపర్ హిట్ చిత్రం ది కేరళ స్టోరీ. ఈ సినిమాపై విడుదలైన అనంతరం విపరీతమైన ట్రోలింగ్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రం ముస్లింలను టార్గెట్ చేస్తూ వారే విలన్లు అంటూ ఉండడంతో ఇది ఇక ప్రోపగండ మూవీ అని అసలైన కేరళ స్టోరీ కాదని నెటిజన్లు తిప్పికోట్టారు. అయితే రంజాన్ మాసం సందర్భంగా తాజాగా ఓ ఇఫ్తార్ పార్టీకి హాజరయ్యింది ఆదాశర్మ. తాజాగా ఈ వీడియో సోషల్ మీడియా వైరల్‌గా మారడంతో ఓ నెటిజన్ ఆదాశర్మను విమర్శిస్తూ పోస్టు పెట్టాడు. నార్మల్ రోజులలో ముస్లింలను విలన్లుగా చిత్రికరిస్తూ వారిపై ద్వేషపూరిత సినిమాలు చేస్తుంది. అదే ఈవెన్ డేస్‌లో ముస్లింలు గొప్పవారు.. ఎందుకంటే నన్ను బిర్యానీ కోసం ఇన్‌వైట్ చేశారు. ఈమె ఎంత మోసం చేస్తుంది జనాలను అంటూ పోస్టు పెట్టాడు. దీనికి కౌంటర్‌గా ఆదాశర్మ డియర్ సర్.. ఏ రోజు అయిన సరే ఉగ్రవాదులు అనే వాళ్లు విలన్లు. ముస్లింలు కాదు అంటూ స్ట్రాంగ్ రిప్లయ్ ఇచ్చింది.





# ఎస్‌బీఐ కస్టమర్లకు షాక్..

దేశంలో అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ ఇండియా (SBI) తమ డెబిట్ కార్డ్‌ల వార్షిక నిర్వహణ ఛార్జీలను పెంచేసింది. బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం ఎస్‌బీఐ డెబిట్ కార్డ్‌లపై వార్షిక నిర్వహణ ఛార్జీలను రూ.75 పెంచింది. దీనికి జీఎస్టీ అదనంగా ఉంటుంది. పెరిగిన చార్జీలు ఏప్రిల్ 1 నుండి అమలులోకి వస్తాయి. ఎస్‌బీఐ తమ కస్టమర్లకు అనేక రకాల డెబిట్ కార్డ్‌లను అందిస్తుంది. వాటికి తదనుగుణంగా వార్షిక నిర్వహణ రుసుమును వసూలు చేస్తుంది. ఎస్‌బీఐ వెబ్‌సైట్ ప్రకారం, దాని క్లాసిక్, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డ్‌లకు వర్తించే ప్రస్తుత వార్షిక నిర్వహణ ఛార్జీలు రూ. 125 ప్లస్ జీఎస్టీ ఉండగా ఏప్రిల్ 1 నుండి రూ. 200 ప్లస్ జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా యువ, గోల్డ్, కాంబో డెబిట్ కార్డ్‌ల నిర్వహణ రుసుములు రూ. 175 ప్లస్ జీఎస్టీ ఉండగా ఏప్రిల్ 1 తర్వాత రూ. 250 ప్లస్ జీఎస్టీ ఉంటుంది. ఇక ప్లాటినం డెబిట్ కార్డ్ వార్షిక నిర్వహణ రుసుము ఏప్రిల్ 1 తర్వాత రూ. 250 ప్లస్ జీఎస్టీ నుండి రూ. 325 ప్లస్ జీఎస్టీకి పెరుగుతుంది.



# బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో బుధవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చీపురుబట్టి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతాబలగాలకు, మావోయిస్టులు తారసపడ్డారు. దాంతో భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. అవతలివైపు నుంచి కాల్పులు ఆగిపోయిన అనంతరం భద్రతాబలగాలు వెళ్లి పరిశీలించగా.. ఘటన స్థలంలో ఆరుగురి మృతదేహాలు కనిపించాయి. మావోయిస్టులకు సంబంధించిన మారణాయుధాలు, పేలుడు పదార్థాలు కూడా దొరికాయి. వాటిని సీజ్ చేసిన పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



బాల్టిమోర్ బ్రిడ్జ్ ప్రమాదంలో

# ఆరుగురు మృతి

అమెరికాలోని బాల్టిమోర్‌లో ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జ్‌ను ఓ సరుకు రవాణా నౌక ఢీకొన్న విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. నౌక ఢీకొన్న సమయంలో మిస్సైన వారు మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. దాలి అనే కంటేనర్ షిప్‌లో సిబ్బంది మొత్తం భారతీయులే అని తేలింది. నౌక ప్రయాణిస్తున్న సమయంలో పవర్ పోయిందని, దాంతో ఆ నౌక బ్రిడ్జ్‌ను ఢీకొన్నట్లు తెలుస్తోంది. 22 మంది నౌకా సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. బ్రిడ్జ్‌పై రిపేర్ వర్క్ చేస్తున్న ఆరుగురు మిస్సింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. నౌక ఢీకొన్న సమయంలో బ్రిడ్జ్‌పై ఉన్న గుంతలను ఆ వర్కర్లు రిపేర్ చేస్తున్నారు.

## ఈ టాబ్లెట్ ఎక్కువగా వాడితే మరణమే!




మూర్ఛ, నరాల నొప్పి మరియు ఆందోళన వంటి సమస్యలకు (ప్రెగబాలిన్)ను సూచిస్తారు. అయితే అతిగా వాడితే ప్రాణం పోయే ప్రమాదం ఉంది. ప్రపంచంలోని చాలా దేశాల్లో ప్రెగబాలిన్ అధిక మోతాదుతో చాలా మంది మరణించారని ఇంగ్లాండ్ వైద్యులు చెబుతున్నారు. దీనిని తీసుకునే వారు మద్యానికి దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తక్కువ మోతాదులో తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదని చెబుతున్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# మోడీ టార్గెట్ 370

కేంద్ర ఎన్నికల సంఘం (EC) సార్వత్రిక ఎన్నికల తేదీలను ప్రకటించకముందే 195 మందితో తొలి జాబితాను విడుదల చేసిన భారతీయ జనతా పార్టీ (BJP) ఇప్పటి వరకు నిన్న విడుదల చేసిన 6వ జాబితాతో కలిపితే మొత్తం 405 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మిత్రపక్షాలతో కలిసి 'మిషన్ 400 ప్లస్' అనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందులో తన వాటాగా 'టార్గెట్ 370' సాధించాలని చూస్తున్న ఆ పార్టీ.. ఏకంగా సుమారు 100 మంది సిట్టింగ్ ఎంపీలకు 'నో' చెప్పింది. అంటే 2019లో గెలుపొందిన 303 మందితో పోల్చితే దాదాపు మూడో వంతు. అంటే ప్రతి ముగ్గురు బీజేపీ ఎంపీల్లో ఒకరిని కట్ చేసింది. తెలంగాణలోని నలుగురు బీజేపీ ఎంపీల్లో ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు టికెట్ నిరాకరించిన ఉదాహరణ మన కళ్లముందే ఉంది. దేశవ్యాప్తంగా ఇదే తరహా కసరత్తు జరిగిందని సంఖ్యను చూస్తే అర్థమవుతోంది. సిట్టింగ్ ఎంపీలకు సీట్లు కట్ చేయడం ఒకెత్తయితే.. ప్రత్యర్థుల కంటే చాలా ముందుగానే అభ్యర్థులను ప్రకటించడం మరో ఎత్తు. మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో మిత్రపక్షాలకు పోను బీజేపీ సొంతంగా 440-450 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. వాటిలో ఇప్పటి వరకు 405 స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసి జాబితా కూడా విడుదల చేసింది. ఈ లెక్కన చూస్తే అభ్యర్థుల ఎంపికలో బీజేపీ ఇప్పటికే 90 శాతం కసరత్తు పూర్తి చేసింది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుపుకున్న మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఇదే వ్యూహాన్ని అనుసరించి, తాము ఇంతవరకు గెలవలేకపోయిన నియోజకవర్గాలతో పాటు వరుసగా ఓడిపోతూ వచ్చిన నియోజకవర్గాల్లో మెరుగైన ఫలితాలు సాధించగలిగింది. అంతిమంగా ఆ మూడు రాష్ట్రాల్లోనూ కమలదళం విజయం సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలిగింది. ఇప్పుడు జాతీయస్థాయిలో ఈ వ్యూహాన్ని అమలు చేస్తూ గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని భావిస్తోంది.

**సిట్టింగ్‌లకు సీట్ కటింగ్‌తో సందేశం**



ఎంత గొప్ప పాలన అందించినా.. సమాజంలోని అన్ని వర్గాలను సంతృప్తిపర్చడం సాధ్యం కాదు. పదేళ్లుగా వరుసగా అధికారంలో ఉన్న పార్టీ పట్ల ఓటర్లలో సహజంగా ఎంతో కొంత వ్యతిరేకత ఏర్పడుతుంది. ఆ వ్యతిరేకతలో స్థానిక ప్రజా ప్రతినిధుల పనితీరు కూడా ఒక భాగం. కొన్ని సందర్భాల్లో ముఖ్యమంత్రి పాలనపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నా.. స్థానిక ఎమ్మెల్యేల తీరు నచ్చక ప్రత్యర్థి పార్టీకి ఓటేసిన సందర్భాలు ఉన్నాయి. ఎక్కడైతే స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకుండా ఉంటారో, ప్రజలు ఏవగించుకునేలా వ్యవహరిస్తారో.. అక్కడ ఈ తరహా భావన ఏర్పడుతూ ఉంటుంది. తెలంగాణలో వరుసగా 9 సంవత్సరాలు పాలన అందించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఓటమికి దారితీసిన కారణాల్లో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న అభ్యర్థులను సైతం మార్చకపోవడం ఒకటని రాజకీయ విశ్లేషకులు చెబుతూ ఉంటారు. ఇలాంటి ఉదాహరణలు మనకు దేశవ్యాప్తంగా చాలానే కనిపిస్తాయి. అభ్యర్థులను మార్చడం ద్వారా ఈ వ్యతిరేకతను ఎదుర్కోవచ్చు అనేది పార్టీ అధినేతల వ్యూహంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా మూడొంతుల మంది సిట్టింగ్ ఎంపీలకు టికెట్లు నిరాకరించడం వెనుక కూడా ఇదే కారణమని కమలదళం వర్గాలు చెబుతున్నాయి. సిట్టింగ్‌లను మార్చడంలో బీజేపీ ఒక పద్ధతిని అనుసరించింది. వయోధికులు, వరుసగా 3 సార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు గెలిచినవారికి టికెట్లు నిరాకరించింది. తద్వారా ఆయా స్థానాల్లో తర్వాతి తరం నేతలకు అవకాశం దొరికింది. ఇది కార్యకర్తల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. లేదంటే కొన్ని నియోజకవర్గాల్లో ఒక కుటుంబమే దశాబ్దాలుగా పాతుకుపోయి కూర్చుంటుంది. దాంతో ఆ నియోజక వర్గంలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అవకాశం దొరక్కుండా పోతుంది. సిట్టింగ్ ఎంపీలనే కాదు, కొద్ది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన మధ్యప్రదేశ్‌లో సుదీర్ఘకాలం సీఎంగా ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్‌నే మార్చేసింది. అలాగే రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సామాన్య నేతలను సింహాసనం ఎక్కించి ముఖ్యమంత్రులను చేసింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీలను కాదని కొత్తవారికి టికెట్ ఇవ్వడం ద్వారా పార్టీ కార్యకర్తలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలియజెప్పే ప్రయత్నం చేస్తోంది. అలాగే తరచుగా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ యావత్ పార్టీకే మచ్చ తెచ్చేలా ప్రవర్తించిన సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, రమేశ్ బిధూరి, పర్వేష్ సింగ్ సాహిబ్ వర్మ, వరుణ్ గాంధీ, అనంత్ కుమార్ హెగ్డే వంటి సిట్టింగ్ ఎంపీలకు కూడా బీజేపీ నాయకత్వం నిర్మొహమాటంగా నో చెప్పేసింది. పార్టీకి నష్టం కల్గించే చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తుంది అన్న బలమైన సందేశాన్ని కూడా పంపింది.

**జాబితాలో వెనుకబడ్డ కాంగ్రెస్**

బీజేపీ ఇప్పటి వరకు ప్రకటించిన 405 మంది అభ్యర్థులతో పోల్చితే కాంగ్రెస్ ఇప్పటి వరకు కేవలం 190 మందిని మాత్రమే ప్రకటించి వెనుకంజలో ఉంది. అభ్యర్థుల ఎంపికలో జరుగుతున్న జాప్యానికి కారణం ఆయా రాష్ట్రాల్లో ఉన్న అంతర్గత కుమ్ములాటలతో పాటు విపక్ష (I.N.D.I.A) కూటమిలోని పార్టీలతో పొత్తులు, సీట్ల సర్దుబాటు వ్యవహారం తేలకపోవడం వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయి.



## మిస్ యూనివర్స్ పోటీల్లో సౌదీ అరేబియా

ఇస్లామిక్ దేశాలలో సౌదీ అరేబియా అత్యంత సంపన్న దేశం. ఈ దేశం నుంచి ఇప్పటి వరకు ఒక్క మహిళ కూడా అందాల పోటీల్లో పాల్గొన్న దాఖలాలు లేవు. అయితే ఫ్యాషన్ రంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మంగా భావించే మిస్ యూనివర్స్ 2024 అందాల పోటీలకు తొలిసారి సౌదీ అరేబియా పోటీ చేయనుంది. దీంతో సౌదీ అరేబియావైపు ప్రపంచ దేశాలన్నీ తొంగి చూస్తున్నాయి. ఈ దేశానికి రూమీ అల్కహ్తాని (27) అనే మోడల్ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ విషయాన్ని ఈ అందాల భామ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా సోమవారం (మార్చి 26) స్వయంగా వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన మిస్ యూనివర్స్ పోటీలకు తన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు రూమీ అల్కహ్తాని తన గ్లామరస్ ఫొటోలను కూడా షేర్ చేసింది.




## లాభాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:23 గంటల సమయంలో సెన్సెక్స్ 180 పాయింట్లు లాభపడి 72,650 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 61 పాయింట్లు పెరిగి 22,066 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.31 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, మారుతీ, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. నెస్లే ఇండియా, ఎం అండ్ ఎం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి..




## ఆప్ నేత నివాసంలో ఈడీ సోదాలు

ఆమ్ ఆద్మీ పార్టీ( ఆప్) నేత దీపక్ సింగ్లా నివాసంతో సహా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు నిర్వహిస్తోంది. పలువురు ఆప్ నేతల సన్నిహితుల నివాసాల్లో ఈడీ సోదాలు జరుపుతోంది. తాజాగా ఈడీ పంజాబ్‌పై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఏకకాలంలో చండీగఢ్‌లో కూడా ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. ఈడీ రాడార్‌లో మరో ఆప్ నేత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ కక్షలతో బీజేపీ తమపై ఈడీ దాడులు చేయిస్తుందని ఆప్ నేతలు మండిపడుతున్నారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మనీలాండరింగ్ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టై.. ఈడీ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. ఆప్ నేతలపై తాజాగా జరుగుతున్న ఈడీ సోదాలతో లిక్కర్ స్కామ్‌తో సంబంధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

దేశంలో బంగారం ధరలు నిన్నటితో పోలిస్తే ఇవాళ పెరిగి.. వెండి ధరలు మాత్రం తగ్గాయి. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ. 200 పెరిగి.. రూ. 61,350 కి చేరింది. అలాగే 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.220 పెరిగి.. రూ. 66,930 గా ఉంది. అదేవిధంగా కిలో వెండి ధర రూ. 300 తగ్గి.. రూ.80,200 గా ఉంది. కాగా, తెలుగు రాష్ట్రాల్లో ఇవే ధరలు అమల్లో ఉంటాయి.



## ISI వైఖరిపై సుప్రీంకోర్టుకు లేఖ

పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు అక్కడి సుప్రీంకోర్టుకు లేఖ రాశారు. పాకిస్థాన్ ఇంటర్- సర్వీసెస్ ఇంటెలిజెన్స్ అధికారులు న్యాయ వ్యవస్థను, విచారణను ఎలా ప్రభావితం చేస్తున్నారో లేఖలో పేర్కొన్నారు. న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై తాము ఎలా స్పందించాలో చెప్పాలని, దీనిని నిరాకరించడానికి తమకు దిశానిర్దేశం చేయాలని కోరారు.

## ఆహారం చేజిక్కించుకునేందుకు వెళ్లి 18 మంది మృతి



ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధంతో పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌లో విధ్వంసం నెలకొంది. ఓ వైపు పౌరుల మరణాలు, మరోవైపు ఆకలి కేకలతో గాజాలో పరిస్థితి దయనీయంగా మారింది. తినేందుకు తిండి లేక, తాగేందుకు నీళ్లు లేక, తలదాచుకునేందుకు గూడు లేక అక్కడి ప్రజలు అల్లాడిపోతున్నారు. మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో ఎటువైపు నుంచి మృత్యువు వెంటాడుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. తాజాగా గాజాలో మరో దయనీయ ఘటన చోటు చేసుకుంది. ఎయిర్‌డ్రాప్ ద్వారా జారవిడిచిన ఆహారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంతో తీవ్రంగా నష్టపోయిన గాజా ప్రజలను ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు మానవతా సాయం చేసేందుకు ముందుకొస్తున్న విషయం తెలిసిందే. రోడ్డు, వాయు, సముద్ర మార్గాల ద్వారా ఆహారాన్ని అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విమానాలు జారవిడిచిన ఆహారం డబ్బాలను చేజిక్కుంచుకునేకి సముద్రంలోకి వెళ్లి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో 12 మంది ఆహార డబ్బాలు పడి మరణించగా... మరో ఆరుగురు నీటి ప్రవాహానికి ప్రాణాలు విడిచారు. ఈ ఘటన ఉత్తర గాజాలోని బీచ్ లాహియా బీచ్‌లో చోటు చేసుకుంది. పాలస్తీనా ఆరోగ్యశాఖ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు.



## సెగలు పుట్టిస్తోన్న మౌనీ రాయ్

సీరియల్‌తో తెలుగు ప్రేక్షులకు దగ్గరైంది మౌనిరాయ్. స్మాల్ స్క్రీన్ నుంచి వచ్చిన ఈ బ్యూటీ.. ఇప్పుడు వెండితెరపైనా మెరుస్తోంది. తుమ్ బిన్2, గోల్డ్ చిత్రాలతో పాటు కేజీఎఫ్‌లో ఐటెం సాంగ్‌లో నటించి అందరి దృష్టిని ఆకర్షించింది. సామాజిక మాధ్యమాలలో హాట్ ఫోటోలతో అదరగొడుతోంది. లేటెస్ట్‌గా విదేశాల్లో పొట్టి దుస్తుల్లో కనిపించి కనువిందు చేసింది. మౌనీ రాయ్.. నాగినీ సీరియల్‌లో టైటిల్ పాత్రలో కనిపించి అభిమానులను ఫిదా చేసింది. అంతకు ముందు 'క్యూ కీ కభీ సాస్ భీ బహు థీ' సీరియల్‌లో నటించినా రాని గుర్తింపు నాగిని సీరియల్‌తో వచ్చింది. అటు సీరియల్స్ చేస్తూనే సినిమాల వైపు తన దృష్టి మరల్చి అక్కడ సత్తా చూపెడుతోంది.మౌనీ రాయ్ 'నాగిని' సీరియల్‌తో వచ్చిన పాపులారిటీతో 2011లో తొలిసారి 'హీరో హిట్లర్ ఇన్ లవ్' అనే పంజాబీ సినిమాతో తొలిసారి వెండితెరకు పరిచయమైంది. మౌనీ రాయ్‌కు ఇన్‌స్ట్రాగ్రామ్‌లో 27.2 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. మన దగ్గర ఎంతో మంది హీరోయిన్స్‌కు కూడా ఈ రేంజ్ ఫాలోవర్స్ లేరు. కేవలం 'నాగిని' అనే ఒకే ఒక్క సీరియల్ ఈమె కెరీర్ మొత్తాన్ని మార్చేసిందనే చెప్పాలి.